RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 16 | డిసెంబర్ 18, 2025 | వెల : రూ.3-00



నేటి యువతకు స్ఫూర్తి శ్రీచరణి

4లో..

# 'అప్పు'ల పాలు!?



## అవమానం..తప్పని భారం!

- ☐ తలలు పట్టుకుంటున్న ఓడిన సర్పంచ్ అభ్యర్థులు
- ☐ కొన్నిచోట్ల ఆత్మహత్యలు.. ఆత్మహత్యాయత్నాలు
- ☐ గెలుపు కోసం రూ.లక్షల ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- ☐ ఆస్తులు, ఆభరణాలు అమ్మినా దక్కని పదవి
- ☐ మొదట పెద్ద నేతల హామీలు.. ఓటమి తర్వాత దూరాలు
- ☐ రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లో విషాద ఘటనలు
- ☐ ఇవీ రాష్ట్రంలో జరిగిన స్థానిక ఎన్నికల తీరు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

రాష్ట్రంలో జరిగిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు గ్రామ రాజకీయాల్లో తీవ్ర విషాద ఛాయలను మిగిల్చాయి. ఎప్పటి నుంచో ఈ ఎన్నికల కోసం ఎదురుచూస్తూ, ఈసారి ఎలాగైనా గెలవాలన్న పంతంతో రంగంలోకి దిగిన అనేక మంది అభ్యర్థులు.. ఓటమి తర్వాత ఆర్థికంగా, మానసికంగా కుదేలయ్యారు. గెలుపు కలలు కరిగిపోయి.. అప్పులు, అవమానం, నిరాశ మధ్య నలిగిపోతున్న దృశ్యాలు అనేకం రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. లక్షలు ఖర్చు చేసినా ఓడిపోవడంతో కొందరు గుండె నిబ్బరంతో ఉంటే.. మరికొందరమో గ్రామాల్లో అవమానం, అప్పుల భారంతో ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. స్థానిక ఎన్నికల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో విషాద ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.

**– ఎన్నికలకు ముందే అన్ని సిద్ధం..**

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే అనేక మంది అభ్యర్థులు తమ ప్రచారాన్ని మొదలుపెట్టారు. గ్రామాల్లో పట్టు సంపాదించుకోవడానికి సంవత్సరాలుగా కష్టపడ్డారు. ఈసారి సర్పంచ్ మనదే అన్న నమ్మకంతో ప్రచార వ్యూహాలు సిద్ధం చేసుకున్నారు. గెలుపుపైనే పూర్తి విశ్వాసంతో ముందుకు సాగారు. ఈసారి ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో ఎంత ఖర్చుకైనా వెనకాడలేదు. ప్రచారం, వాహనాలు, మందీమార్బలం, భోజనాలు, మద్యం, బహుమతులు ఇలా రోజువారీ ఖర్చులు లక్షల రూపాయల్లోకి చేరాయి. ఒక్కో గ్రామంలో సర్పంచ్ పదవికే రూ.40 నుంచి 60 లక్షల వరకు ఖర్చు చేసిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.

**– అప్పుల మీద అప్పులు చేసి..**

ఎప్పటినుంచో ఎన్నికల కోసం ఎదురుచూస్తూ వచ్చిన అభ్యర్థులు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశారు. ప్రచారం సాగుతున్న కొద్దీ ఖర్చులు పెరిగిపోవడంతో అప్పుల మీద అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజూ వచ్చే ఖర్చులను భరించలేక మరింత అప్పుల ఊబిలో చిక్కుకున్నారు.

**– ఆస్తులు అమ్ముకున్నా దక్కని పదవి**

కొంతమంది అభ్యర్థులు తమ భూములు, బంగారం, ఇళ్లు, ఇతర ఆస్తులు అమ్ముకుని మరీ ఎన్నికల బరిలో నిలిచారు. గెలిస్తే అన్నీ తిరిగి వస్తాయి.. అన్న ఆశతో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. కానీ ఫలితాల రోజు ఆ ఆశలు ఆవిరయ్యాయి. ఓటమితో ఒక్కసారిగా జీవితం అగాధంలో పడిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఫలితాలు వెలువడిన తర్వాత అనేక గ్రామాల్లో ఓడిపోయిన అభ్యర్థులు తలలు పట్టుకుని కూర్చున్న దృశ్యాలు కనిపించాయి. అప్పుల భారాన్ని ఎలా తీర్చాలి? కుటుంబాన్ని ఎలా నడపాలి? అన్న ప్రశ్నలు వెంటాడుతున్నాయి. కొందరు గ్రామాల్లో బయటకు రావడానికే భయపడుతున్నారు.

మిగతా 3వ పేజీలో..

## సర్పంచుల బాధ్యతల స్వీకరణ వాయిదా

- డిసెంబర్ 20 నుంచి 22కు మారిన అపాయింటెడ్ డే
- ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీరాజ్ శాఖ
- మంచి ముహూర్తాలు లేనందునే నిర్ణయం




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

రాష్ట్రంలోని నూతనంగా ఎన్నికైన సర్పంచుల బాధ్యతల స్వీకరణకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా నిర్ణయించిన డిసెంబర్ 20వ తేదీని రద్దు చేసి, డిసెంబర్ 22వ తేదీన 'అపాయింటెడ్ డే'గా ఖరారు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికైన సర్పంచులందరూ కొత్త తేదీనే పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. డిసెంబర్ 20వ తేదీన సరైన ముహూర్తాలు లేవన్న కారణంతో తేదీ మార్పు చేయాలంటూ పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై సమగ్రంగా పరిశీలించిన ప్రభుత్వం, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బాధ్యతల

మిగతా 3వ పేజీలో..

## విద్యార్థులు చనిపోతున్నా అంత నిర్లక్ష్యమా?



- గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో భద్రత కరవు
- ఇప్పటికే 100మందికి పైగా విద్యార్థులు మృతి
- సాయి లిఖిత మృతి ప్రభుత్వ అసమర్థతే
- ఇకనైనా సీఎంస్పందించి బాధ్యత వహించాలి
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న వంద మందికి పైగా విద్యార్థులు మృతి చెందారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల

మిగతా 3వ పేజీలో..

## దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతాం




- ☐ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యం
- ☐ 17 కీలక రంగాల్లో సమానంగా పురోగతి అవసరం
- ☐ గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం నష్ట పోయింది
- ☐ 2047 విజన్‌తో రాయలసీమ, ఉత్తరాంధ్రపై స్పెషల్ ఫోకస్
- ☐ కలెక్టర్ల సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

**వేద న్యూస్, అమరావతి ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి ప్రగతి పథంలో నడిపించి, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 5వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై లోతైన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను అధికారుల ముందుంచిన సీఎం, గడచిన రెండు త్రైమాసికాల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని పేర్కొంటూ, ఈసారి 17.11 శాతం వృద్ధి లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.

మిగతా 3వ పేజీలో..

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు కొట్టివేత!

- ఐదుగురు ఎమ్మెల్యేలపై ఆరోపణలకు ఆధారాలు లేవన్న స్పీకర్
- సుప్రీంకోర్టు ఆదేశాల నడుమ వెలువడిన కీలక నిర్ణయం
- మిగిలిన పిటిషన్లపై విచారణకు సమయం కోరే అవకాశం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి అనంతరం కాంగ్రెస్‌లోకి ఫిరాయించారన్న ఆరోపణలతో దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పు వెలువరించారు. ఐదుగురు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేశారు. ఎమ్మెల్యేలు

మిగతా 3వ పేజీలో..

## డిజిటల్ అరెస్టు.. రూ.2 కోట్ల మోసం!





- సైబర్ కేటుగాళ్లకు చిక్కిన మహిళా సాఫ్ట్ వేర్ ఇంజినీర్
- కొరియర్ పేరుతో మొదలైన స్కామ్
- భయంతో ప్లాట్‌లు, ఫ్లాట్ అమ్మి డబ్బు చెల్లింపు
- వైట్‌ఫీల్డ్ సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తు

4లో..

# రంగారెడ్డి జిల్లాకు ఈఎస్ఐ ఆస్పత్రి

- 100 పడకలతో మంజూరుకు కేంద్రం నిర్ణయం
- కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి
- భూ సేకరణ కోసం రూ.16.125కోట్ల నిధుల కేటాయింపు
- వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**వేద న్యూస్, రంగారెడ్డి:**

రంగారెడ్డి జిల్లాలో కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. జిల్లాలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ ఆస్పత్రి ద్వారా దాదాపు 1.32 లక్షల మంది కార్మికులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 11న కేంద్ర కార్మికశాఖ మంత్రి డా. మన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షతన జరిగిన 197వ ఈఎస్ఐ సమావేశంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు ఆమోదం లభించిందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ భూసేకరణ కోసం సుమారు రూ.16.125 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఈ ఆస్పత్రి నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శంషాబాద్ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో, కార్మికుల ఆరోగ్య అవసరాలు మరింత పెరిగాయని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నిర్మించనున్న ఈఎస్ఐ ఆస్పత్రి కార్మికులకు, వారి కుటుంబాలకు సకాలంలో వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. పరిశ్రమల విస్తరణకు అనుగుణంగా ఆరోగ్య మౌలిక వసతులను బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# బాలుడి మర్డర్ మిస్టరీ వీడింది

- సీసీ టీవీ ఆధారాలతో నిందితుడి అరెస్ట్
- ఐదు రోజుల్లోనే కేసు ఛేదించిన పోలీసులు



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న పదకొండు ఏళ్ల బాలుడి హత్య కేసులో పోలీసులు వేగవంతంగా స్పందించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో షేక్ ఇమ్రాన్ ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. హృదయ విదారకమైన ఈ ఘటన నగరవ్యాప్తంగా కలకలం రేపింది. డిసెంబర్ 7వ తేదీన నిందితుడు మాస్టర్ మహమ్మద్ అస్గర్ అనే బాలుడిపై దాడి చేసి, అతడి తలను రోడ్డుపై బలంగా కొట్టినట్లు దర్యాప్తులో తేలింది. ఈ దాడిలో బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 12వ తేదీన బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ కీలక ఆధారంగా మారింది. దాడి జరిగిన విధానాన్ని స్పష్టంగా చూపించే వీడియో ఆధారాలతో నిందితుడి పాత్రను పోలీసులు నిర్ధారించారు. పక్కా ఆధారాలతో డిసెంబర్ 16వ తేదీన నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరిచేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కేసు ఛేదనలో చాంద్రాయణగుట్ట పోలీస్ బృందం ప్రశంసనీయమైన పనితీరును కనబరిచిందని అధికారులు తెలిపారు. దక్షిణ తూర్పు జోన్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. శ్రీకాంత్ పర్యవేక్షణలో, ఏసీపీ సుధాకర్ మార్గదర్శకత్వంలో, ఎస్‌హెచ్‌వో ఆర్. గోపి నేతృత్వంలో సిబ్బంది సమన్వయంతో పనిచేసి కేసును ఛేదించారు. న్యాయం దిశగా ముందడుగు పడిందని, చట్టం తన పని తాను చేస్తుందని పోలీసులు స్పష్టం చేశారు.

# ప్రభుత్వ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలి




- గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణమే ప్రాధాన్యం
- ‘అడవితల్లి బాట’తో గ్రామీణాభివృద్ధిలో కీలక పురోగతి
- కలెక్టర్ల సదస్సులో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, మంత్రులు


**వేద న్యూస్, అమరావతి ప్రతినిధి:**

జిల్లా కలెక్టర్లు నిబద్ధతతో పని చేస్తూ కూటమి ప్రభుత్వ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన 5వ కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రివర్గ సహచరులు, ఉన్నతాధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధిలో జిల్లా పరిపాలన కీలక పాత్ర పోషిస్తున్నదని పేర్కొంటూ, కలెక్టర్ల సేవలను ఉప ముఖ్యమంత్రి అభినందించారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. ‘అడవి తల్లి బాట’ పేరుతో చేపట్టిన రహదారి ప్రాజెక్టును సంబంధిత జిల్లాల కలెక్టర్లు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నరేగా నిధులతో చేపట్టిన పల్లె పండుగ 1.0 కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయగలిగామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సుమారు 4 వేల కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు నిర్మించడంతో పాటు, 22,500 మినీ గోకులాలు, 15 వేల నీటి తొట్టెలు, 1.2 లక్షల ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 41.12 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించి, 15.95 కోట్ల పని దినాల ద్వారా రూ. 4,330 కోట్ల వేతనాలు చెల్లించడంతో పాటు, మెటీరియల్ కాంపోనెంట్ కింద మరో రూ. 1,056.85 కోట్లు బిల్లుల రూపంలో చెల్లించామని వివరించారు. ఇది గ్రామీణ ప్రజలకు గణనీయమైన ఆర్థిక భరోసా ఇచ్చిందన్నారు. జూన్ నెలలో ప్రారంభించిన స్వచ్ఛ రథం కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని, ఒక యూనిట్‌తో మొదలైన ఈ కార్యక్రమం ప్రస్తుతం 25 యూనిట్లకు విస్తరించిందని తెలిపారు. భవిష్యత్తులోనూ మరింత ఉత్సాహంగా పని చేస్తూ ప్రజలకు నిబద్ధతతో సేవలు అందించాలని కలెక్టర్లకు ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# యూట్యూబ్ రిపోర్టర్ అంటూ బెదిరింపులు

- బాధితుని వద్దనుంచి రూ.35 వేలు డిమాండ్
- ఇవ్వకుంటే అరెస్ట్ చేయిస్తానంటూ బెదిరింపులు
- షాలిబండలో మహ్మద్ బిలాల్ పై కేసు
- అరెస్ట్ చేసిన పోలీసులు
- మీడియా పేరుతో అక్రమాలు సహించబోమని డీసీపీ హెచ్చరిక

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



యూట్యూబ్ రిపోర్టర్‌గా తనను తాను ప్రచారం చేసుకుంటూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై షాలిబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. మహమ్మద్ బిలాల్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో కేసును మేనేజ్ చేస్తానని, అరెస్టు కాకుండా చూస్తానని చెప్పి ఒక వ్యక్తి నుంచి రూ.35 వేల డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బు ఇవ్వకపోతే అరెస్ట్ చేయిస్తానని బెదిరించినట్టు ఆరోపణలు రావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదు ఆధారంగా సేకరించిన ఆధారాల మేరకు నిందితుడు పలు మార్లు ఇదే విధంగా బెదిరింపులకు పాల్పడ్డట్టు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన షాలిబండ పోలీసులు, నిందితుడిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. ఈ కేసుపై దక్షిణ మండల డీసీపీ కిరణ్ ఖరే మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు మీడియా ప్రతినిధులమని చెప్పుకుని కేసుల సెటిల్‌మెంట్, మామూళ్ల వసూలు, బెదిరింపులు వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మీడియా పేరుతో ఎవరైనా బెదిరింపులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీసీపీ ప్రజలను కోరారు. అలాంటి సమాచారం అందించిన వారికి పూర్తి రక్షణ కల్పిస్తామని, తక్షణమే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అక్రమాలకు పాల్పడే ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని పోలీసులు స్పష్టంచేశారు.

# డిజిటల్ మోసాల పట్ల అలెర్ట్ గా ఉండాలి




- ‘ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్’ ప్రజా కేంద్రీకృత ఉద్యమం
- అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయొద్దు
- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయెల్

**వేద న్యూస్, వరంగల్ పట్టణం:**

‘ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్’ ప్రజా-కేంద్రీకృత ఉద్యమమని, క్షేత్రస్థాయి విస్తరణతో పాటు విస్తృత డిజిటల్ అవగాహనను కలిపి సైబర్ నేరాలను అరికట్టడమే దీని లక్ష్యమని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయెల్ అన్నారు. డిజిటల్ స్కామ్‌ల ద్వారా పెరుగుతున్న ముప్పును ఎదుర్కొనే లక్ష్యంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయెల్ డిసెంబర్ 2025 లో ‘ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్’ పేరుతో ఆరు వారాల రాష్ట్రవ్యాప్త సైబర్ అవగాహన ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ప్రచారంలో భాగంగా మూడో వారం కార్యక్రమం ‘పైసా పైలం’ పేరుతో బుధవారం వరంగల్ బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, లోన్ యాప్ వేధింపులు, ట్రేడింగ్ యాప్ మోసాలు, గుర్తింపు దొంగతనం వంటి ఉద్భవిస్తున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకులు, ఆకర్షణీయమైన ఆర్థిక ఆఫర్లకు దూరంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www. cybercrime. gov.inలో ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ మరియు జాదీ పోలీస్ సూపరింటెండెంట్ శ్రీమతి సాయి శ్రీ సంయుక్తంగా ముఖ్య అతిథులుగా పాల్గొ న్నా రు.

# పోచారం సురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకుంటూ జన్మదిన వేడుకలను జరుపు కున్నారు. అదేవిధంగా మండలం లోని రాణంపల్లి గ్రామంలో విద్యార్థులు, చిన్నారులు కేక్ కట్ చేసి పోచారం సురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, మాజీ జెడ్పిటిసి నారోజి గంగారాం, మాజీ సొసైటీ అధ్యక్షుడు పత్తి రాము, పత్తి లక్ష్మణ్, తోట్ల చిన్న గంగారాం, తోట సంగయ్య, అక్కపల్లి నాగేందర్, ఏఎంసి డైరెక్టర్ పార్వతి ప్రవీణ్, కన్నె రవి, బాలరాజ్, ఎండి ఇమ్రాన్, అనిల్ పటేల్, రమేష్ షేక్ ఖాదర్, అడప శంకర్, కోడె శంకర్, ఎండి షామీర్, దేవుడు గంగారం , సుదర్శన్ గౌడ్ ,పత్తి సాయిలు, షేఖ్ షాదుల్, సిద్ధాపూర్ లక్ష్మణ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- బర్త్ డే వేడుకలకు వెళ్తూ అనంత లోకాలకు..

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



తన మిత్రునితో కలిసి పల్సర్ బైక్ పై రేపాక నుంచి కరీంనగర్ లోని తన స్నేహితుని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనడానికి వెళ్తూ ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతిచెందిన ఘటన అల్గునూర్ ఈనాడు కార్యాలయం సమీపంలో జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన గుర్రం శరత్ రెడ్డి (20) అనే యువకుడుసోమవారం తన ఫ్రెండ్ పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యేందుకు బైక్ పై వెళ్తున్నాడు. ఈ స్కూటీ ఎదురు వచ్చి ఢీకొంది. బైక్ ను ఆపే ప్రయత్నంలో బైకు బ్రేకులు వేయగా ప్రమాద వశాత్తు బైకు పల్టీలు కొట్టి దూరంగా ఎగిరి పడడంతో యువకుడు శరత్ రెడ్డి తలకు బలమైన గాయమై రక్త స్రావం జరిగింది. వెంటనే గాయపడ్డ శరత్ రెడ్డిని కరీంనగర్ ప్రయివేటు హాస్పిటల్ కు చికిత్స నిమిత్తం తరలించగా వైద్యులు హైదరాబాద్ కు మెరుగైన వైద్యం కొరకు తరలించాలని సూచించారు. కుటుంభ సభ్యులు హైదరాబాద్ మెడికవర్ హాస్పిటల్ కు తరలించారు. హాస్పిటల్ వైద్యులు మెరుగైన వైద్యం కొరకు ప్రయత్నాలు కొనసాగించినప్పటికి ఫలితం లేక యువకుడు శరత్ రెడ్డి మృతి చెందాడు. యువకుని మృతితో రేపాక గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# పెన్షనర్లకు సన్మానం

**వేద న్యూస్, బోయినపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం పెన్షనర్స్ డే సందర్భంగా మండల పరిధిలోని సీనియర్ పెన్షనర్స్ అయిన తడుక శంకరయ్య, మల్యాల వెంకటయ్య, మారం చంద్రయ్య, సిహెచ్ సుదర్శనంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ద్యావనపల్లి శ్రీహరి మాట్లాడుతూ.. డీఎస్ నకార, పోరాడి సాధించిన కృషి ఫలితమేనని అన్నారు పెన్షన్ పొందడం అనేది ఎవరి దయాదాక్షిణ్యం కాదని, వారు చేసిన సేవలకు ఇచ్చే ప్రతిఫలమన్నారు. పెన్షన్ పొందడం మనందరి హక్కు అని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు సి.రామ రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి సీనియర్ పెన్షనర్లతో గత స్మృతులను స్మరణ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ సభ్యులు పాల్గొన్నారు.

# 'అప్పు'ల పాలు!?

# అవమానం..తప్పని భారం!

**– అవమానం.. అప్పుల భారంతో..**

ఓటమి తర్వాత ఎదురైన అవమానం, అప్పుల ఒత్తిడితో కొందరు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. కొన్ని చోట్ల ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల జోక్యంతో కొందరిని కాపాడిన సంఘటనలు కలవరపెడుతున్నాయి. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పీపడ్‌పల్లి గ్రామంలో సర్పంచ్ కోసం పోటీ చేసిన ఓ అభ్యర్థి, ఓడిపోతానన్న ఆందోళనతో ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆయన ఆత్మహత్య తరువాత కూడా ఎన్నికల్లో విజయం సాధించాడు. ఖమ్మం జిల్లాలోని సర్పంచ్ అభ్యర్థి ప్రచార ఒత్తిడి కారణంగా గుండెపోటుతో మరణించాడు.

**– ఓటేయలేదు.. మా డబ్బు మాకివ్వండి..**

కొన్ని గ్రామాల్లో ప్రచార సమయంలో ఖర్చు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ ఓడిపోయిన అభ్యర్థులు ఓటర్లను నిలదీసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయి. "మాకు ఓటేయలేదు కదా%ొ% మా డబ్బు మాకు ఇవ్వండి" అంటూ గొడవలకు దిగిన సందర్భాలు రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉద్రిక్తతలకు దారి తీశాయి

**– అమాయకులను రంగంలోకి దింపి..**

పార్టీల పెద్దనేతలు "మేమున్నాం.. గెలుపు ఖాయం" అంటూ అనేక మందిని పోటీలోకి దింపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి వద్ద డబ్బు ఖర్చుపెట్టించి, ఓటమి తర్వాత మాత్రం అదే నాయకులు ముఖం చాటేసిన పరిస్థితి కనిపిస్తోంది. ఫోన్‌లకు అందుబాటులో లేకుండా పోవడం, బాధ్యత నుంచి తప్పించుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ పరిణామాలు గ్రామ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియపై నమ్మకం దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతోందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికలు సేవకు వేదిక కావాల్సిన బదులు.. అప్పులు, లాభనష్టాల లెక్కలుగా మారుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# పెన్షనర్స్ హక్కులను కాలరాస్తున్నారు

**– రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి రాజేశ్వర్**




**వేద న్యూస్, జమ్మికుంట :**


ఏఐఆర్ఎఫ్, ఎన్సిసిపిఐ పిఏ, ఏఐఎస్సిసిటిఓన్ పెన్షనర్ల సంఘాల పిలుపు మేరకు జమ్మికుంట రైల్వే పెన్షనర్ వెల్ఫే ర్ అసోసియేషన్ జమ్మి కుంట బ్రాంచి ప్రెసిడెంట్ దాసరి రాజేశ్వర్ ఆధ్వర్యం లో రైల్వే స్టేషన్ ఆవరణ లో పెన్షర్స్ డే కు బదులుగా ప్రభుత్వ విధానాలకు నిరసన గా బుధవారం పెన్షన్ రక్షణ దినోత్సవాన్ని శాంతియుతం గా నిర్వహించారు. అందులో భాగంగా ఆరు డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. వాలిడేషన్ ఆఫ్ పెన్షన్ రూల్స్ 2025 ను తక్షణమే రద్దు చేయాలని. 2,8 వ వేతన సంఘం, టి ఓ ఆర్ 2026 కు ముందు రిటైర్ అయిన వారికి పెన్షన్ సవరణలను తప్పని సరిగా చేర్చాలనీ ,3, 8 సిపిసి టి ఓ ఆర్ నుండి క్లాజ్ (ఎఫ్ ) ××× నాన్ కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాలకు నిధులు లేని ఖర్చు అనే అంశాన్ని తొలగించాలనీ కోరారు. ప్రస్తుతం ఉన్న రూ.10 లక్షల కోట్ల పెన్షన్ ఫండ్ ను కేవలం పెన్షన్ పథకాల కోసమే వినియోగించాలనీ ,ఆ మొత్తాన్ని పటిష్టం గా కాపాడాలనీ పేర్కొన్నారు. 5, 8 వా వేతన సంఘం టి ఓ ఆర్ అమలు తేదీని 01 జనవరి 2026 గా చేర్చాలనీ, 6.8 వ సిపిసి చర్చల యంత్రాంగం లో ఎస్ సి ఓ వి ఏ సభ్యులను భాగస్వామ్యం చేయాలన్నారు.పెన్షనర్స్ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమం లో దాసరి రాజేశ్వర్ ఏఐఆర్ఆర్ఎఫ్, సిఇసి మెంబర్, సికింద్రాబాద్ డివిజన్ ట్రెజరర్ జమ్మికుంట బ్రాంచ్ సెక్రటరీ శీలం మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ టంగుటూరి వెంకటస్వామి, బంగారి.విద్యాసాగర్, వైస్ ప్రెసిడెంట్ల ఖాజా మొయినుద్దీన్, పర్ష రాములు, సమ్మయ, పర్షరాములు, ట్రెజర్ ఎండి. ఖాదర్ ఖాన్, తప్రా అధ్యక్షులు గరిగే చంద్రయ్య సెక్రటరీ లు ఎస్.రాజయ్య, సారంగపాణి, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సర్పంచుల బాధ్యతల స్వీకరణ వాయిదా

స్వీకరణ తేదీని రెండు రోజులు వాయిదా వేసింది. ఈ నిర్ణయం గ్రామస్థాయిలో ఎలాంటి అయోమయం లేకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. తేదీ మార్పుతో పాటు ఇప్పటికే రూపొందించిన షెడ్యూల్‌లో కూడా పంచాయతీరాజ్ శాఖ మార్పులు చేసింది. అధికారుల సమక్షంలో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమాలు, సంబంధిత పరిపాలనా ఏర్పాట్లు అన్నీ డిసెంబర్ 22వ తేదీకి అనుగుణంగా సవరించారు. జిల్లా, మండల స్థాయి అధికారులకు ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గ్రామ పాలనలో కీలకమైన పాత్ర పోషించే సర్పంచుల బాధ్యతల స్వీకరణ ఒకే రోజు జరగడం వల్ల పాలన సజావుగా ప్రారంభమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై వెంటనే దృష్టి సారించాలని పంచాయతీరాజ్ శాఖ సూచించింది. డిసెంబర్ 22న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పాలన కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టనుంది.

# ఓటు హక్కు వినియోగించుకోవాలి

**– కలెక్టర్ స్నేహ శబరిష్**
**– పోలింగ్ కేంద్రాల పరిశీలన**



**వేద న్యూస్, శాయంపేట:**

మూడో దశ ఎన్నికల్లో భాగంగా శాయంపేట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. వీరి వెంట ఆర్డీఓ నారాయణ, డిఆర్డిఓ పిడి శ్రీనివాస్, తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో ఫణిచంద్ర, సీఐ రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, శాయంపేట మండల కేంద్రంలో 23 గ్రామ పంచాయతీలకు 84.74 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

# దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో సాధించిన త్రైమాసిక ఫలితాలను పరీక్షలు రాసిన విద్యార్థిలా ఆసక్తిగా ఎదురుచూస్తానని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అధికారులు కూడా అదే స్థాయి బాధ్యతతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మొత్తం 17 కీలక రంగాల్లో సమానంగా పురోగతి సాధిస్తేనే రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేశారు. పశుసంపద, తయారీ రంగం, మత్స్య పరిశ్రమ సహా ప్రతి రంగంలో సమగ్ర అభివృద్ధి అవసరమన్నారు.

**గత పాలన వల్ల రాష్ట్రం నష్టపోయింది**

గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధానాల కారణంగా రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు తెలంగాణతో పోటాపోటీగా ఉన్న ఆంధ్రప్రదేశ్, గత పాలన వల్ల దక్షిణాది రాష్ట్రాల్లోనే వెనుకబడిందని చెప్పారు. ఈ పరిస్థితిని మార్చి, రాష్ట్రాన్ని తిరిగి వేగంగా ముందుకు నడిపించి అగ్రస్థానానికి చేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 2024 తర్వాత జీఎస్‌డీపీలో కొంత మెరుగుదల కనిపిస్తోందని, దీన్ని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధిలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. పంటల ప్రణాళికలో స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలు రూపొందించి, డిమాండ్ ఆధారిత పంటలు, నీటి భద్రత, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్ వంటి అంశాలను అనుసంధానించాలని సూచించారు.

**రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రణాళికలు**

అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలను 'పూర్వోదయ' భావన కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చంద్ర౯బాబు తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి గా నిలపాలంటే ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ ప్రయాణంలో ఎవరు వెనుకబడ్డా లక్ష్యాలను చేరుకోవడం కష్టమవుతుం దని హెచ్చరించారు. గేట్స్ ఫౌండేషన్, అగ్రివాచ్ వంటి సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి భూ కేటాయింపు లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలి పారు. ఐటీ, పరిశ్రమల శాఖలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాయ ని చెప్పారు.

# విద్యార్థులు చనిపోతున్నా అంత నిర్లక్ష్యమా?

ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ ఎస్సీ గురుకులంలో 8వ తరగతి విద్యార్థిని సాయి లిఖిత మృతిపై కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి అనారోగ్యానికి గురైనప్పటికీ సకాలంలో వైద్యం అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనమని ఆమె ఆరోపించారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. తరచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతుండటంతో పదుల సంఖ్యలో విద్యార్థులు ఆస్పత్రుల్లో చేరుతున్నా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థుల ప్రాణాల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం బాధ్యతాభావం లేదని ఆమె మండిపడ్డారు. గురుకులాల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు పూర్తిగా క్షీణించాయని, వార్డెన్లు, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని కవిత అన్నారు. వందలాది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినా పాలకుల నుంచి స్పందన లేకపోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. ఇది కేవలం ప్రమాదం కాదని, వ్యవస్థాగత వైఫల్యమని ఆమె వ్యాఖ్యానించారు. ఇకనైనా ముఖ్యమంత్రి స్పందించి గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సాయి లిఖిత కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు, ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మరో విద్యార్థి ప్రాణం పోయే వరకు ప్రభుత్వం ఎదురు చూడకూడదని, విద్యార్థుల భద్రతే మొదటి ప్రాధాన్యంగా ఉండాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు స్పష్టం చేశారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు కొట్టివేత!

అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్‌లపై వచ్చిన ఫిరాయింపు ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పీకర్ స్పష్టం చేశారు. దీంతో వీరిపై అనర్హత వేటుకు నిరాకరించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున మొత్తం పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ స్పీకర్‌కు ఫిర్యాదులు అందాయి. అయితే నెలలపాటు వీటిపై ఎలాంటి విచారణ జరపకుండా వ్యవహారం సాగదీసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపు పిటిషన్లపై విచారణలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు ఇప్పటికే పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు జూలై 31న మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, అక్టోబర్ 21తో గడువు ముగిసినా స్పీకర్ తేల్చకపోవడంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ మండిపడింది. గత నెల 17న నాలుగు వారాల్లోగా విచారణ పూర్తి చేయాలని తుది గడువు విధిస్తూ, నిర్ణయం తీసుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 18లోగా నిర్ణయం వెలువడకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న పరిస్థితి నెలకొంది. దీంతో హడావుడిగా ఈ తీర్పు వెలువడిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఇప్పటివరకు ఐదుగురు ఎమ్మెల్యేలపై మాత్రమే నిర్ణయం తీసుకున్నామని, మిగిలిన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి మరికొంత సమయం కావాలని స్పీకర్ సుప్రీంకోర్టును కోరే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు పది మంది ఎమ్మెల్యేలకు గతంలో నోటీసులు జారీ చేయగా, ఎనిమిది మంది మాత్రమే సమాధానాలు ఇచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్‌ను కలిసి మరికొంత సమయం కోరగా, దానం నాగేందర్ ఇప్పటివరకు స్పందించలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో గురువారం జరిగే సుప్రీంకోర్టు విచారణపై రాజకీయంగా తీవ్ర ఆసక్తి నెలకొంది.

# ఏవియేషన్ ఎడ్యుకేటీకి ముందడుగు




**– ఎంఏఎన్ఎస్ఏఎస్ ట్రస్ట్, జీఎంఆర్ గ్రూప్ మధ్య ఎంఓయూ ఒప్పందం**
**– ఉత్తరాంధ్ర నైపుణ్యాభివృద్ధికి చారిత్రాత్మక మైలురాయి**
**– కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**వేద న్యూస్, భోగాపురం:**

భోగాపురం విమానాశ్రయం సమీపంలో ఏవియేషన్ ఎడ్యుకేటీ స్థాపన దిశగా కీలక అడుగు పడిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఎంఎన్ఎస్ఎస్ఏఎస్ ట్రస్ట్, జీఎంఆర్ గ్రూప్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పంద కార్యక్రమంలో నారా లోకేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఏవియేషన్ రంగంలో నూతన తరం నిపుణులను తీర్చిదిద్దేందుకు బలమైన విద్యా, శిక్షణ వేదిక ఏర్పడనుందని చెప్పారు. ఈ ఏవియేషన్ ఎడ్యుకేటీ ద్వారా పైలట్ ట్రైనింగ్, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, విమాన నిర్వహణ, గ్రౌండ్ హ్యాండ్లింగ్ వంటి విభాగాల్లో ఆధునిక శిక్షణ అందుబాటులోకి రానుంది. భోగాపురం విమానాశ్రయ అభివృద్ధితో అనుసంధానంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోవడం వల్ల ప్రాంతీయ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కలుగుతాయని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఏవియేషన్ రంగంలో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని సాకారం చేయడంలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, జీఎంఆర్ గ్రూప్ కీలక పాత్ర పోషించారని కేంద్ర మంత్రి ప్రశంసించారు. వారి దూరదృష్టి, సహకారంతోనే ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలుస్తోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి రంగంలో ఇది రాష్ట్రానికి గేమ్‌చేంజర్‌గా మారనుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ గ్రూప్ చైర్మన్ జీబీఎస్ రాజుతో పాటు ఉత్తరాంధ్రకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

గ్రేటర్ వరంగల్ శివనగర్ పాడి మల్లారెడ్డి నగర్ కు చెందిన మిరియాల రజిత, కృష్ణ దంపతుల 12 సంవత్సరాల కుమారుడు మిరియాల గౌతమ్ ఇటీవల ఖిలా వరంగల్ చిల్డ్రన్స్ పార్క్ లో గుర్రం తన్నడం మరణించాడు. ఈ విషయాన్ని స్థానికులు జిల్లా కాంగ్రెస్ నాయకులైన శ్రీరాం రాజేష్, పగడాల సతీష్ దృష్టికి తీసుకుని వెళ్ళగా, వారు గౌతమ్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా శ్రీరాం రాజేష్ మాట్లాడుతూ.. మాకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించామని, ఈ విషయాన్ని కొండా దంపతుల దృష్టికి తీసుకుని వెళ్లి వారి చేత కూడా తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అక్షిత్ పటేల్, మాన్యం సతీష్,సంఘని ప్రియదర్శిని,గడ్డం లత స్థానికలు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం డిసెంబర్ 18, 2025

# స్కూలుకు రాలేదని చేయి విరగొట్టాడు..

- మరో విద్యార్థి చేతి వేళ్లను సైతం..
- ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ దాష్టీకం
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన
- వివాదాలమయంగా హంసిని డిజీ స్కూల్ వ్యవహారం



**వేద న్యూస్, వేములవాడ:**

స్కూలుకు రాలేదన్న కారణంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఇద్దరు పదో తరగతి విద్యార్థులను దారుణంగా కొట్టిన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హంసిని డిజీ హైస్కూల్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఈ దాడిలో ఒక విద్యార్థి చేయి విరగగా, మరో విద్యార్థి చేతి వేళ్లు విరిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సాయి, అయాన్ అనే విద్యార్థులు పలు కారణాలతో కొద్ది రోజులుగా పాఠశాలకు హాజరు కాలేకపోయారు. ఇందులో అయాన్ తల్లికి శస్త్రచికిత్స జరగడంతో సుమారు 15 రోజుల పాటు ఆమెను చూసుకునేందుకు స్కూల్‌కు రాలేకపోయాడు. తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండటంతో కుటుంబ బాధ్యతలు తనపై పడినట్లు అయాన్ మీడియాకు వివరించాడు. స్కూల్‌కు తిరిగి వచ్చిన అనంతరం తన పరిస్థితిని వివరిస్తూ క్లాస్‌కు వెళ్లేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ, మాథ్స్ నోట్స్ పూర్తి చేయలేదన్న కారణంతో ప్రిన్సిపాల్ సంతోష్ అయాన్‌తో పాటు మరో విద్యార్థి సాయిపై దాడి చేశాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని, వైద్య చికిత్స తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందిని నిలదీయగా, విషయం బయటకు రాకుండా చూడాలని యాజమాన్యం బేరసారాలకు దిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధిత కుటుంబాలను ఒత్తిడికి గురిచేసినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

**హంసిని చుట్టూ వివాదాలే..**

ఇదిలా ఉండగా, హంసిని డిజీ హై స్కూల్ ప్రారంభం నుంచే ఏటా ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలవడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. సమస్యలు తలెత్తినప్పుడల్లా యూనియన్ పేరుతో, రాజకీయ నాయకుల అండతో వ్యవహారాలను సద్దుమణిగేలా చేయడం యాజమాన్యానికి అలవాటైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. యూనియన్ నాయకుల ఒత్తిడి, రాజకీయ నాయకుల అండతో పాఠశాల యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన హంసిని డీజీ పాఠశాలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. పిల్లల భద్రత, హక్కుల విషయంలో ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ప్రశాంతంగా మూడవ విడత ఎన్నికలు

- ఎలాంటి ఘటనలకు తావివ్వొద్దు
- సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుగుతున్నాయని ఎస్పీ మహేష్ బి. గితే చెప్పారు. బుధవారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంబిరావుపేట, ముస్తాబద్ మండలాలలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించి బందోబస్తులో ఉన్న అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

# మహర్షి సేవ సమితి ఆర్థిక సహాయం

**వేద న్యూస్, బోయినిపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వర్ధవెల్లి గ్రామంలో ఇటీవల మాదాల సుధాకర్ అనే టీవీ మెకానిక్ అనారోగ్యంతో మరణించాడు. సుధాకర్ కు 8 సంవత్సరాల అమ్మాయి ఉన్నది వారి కుటుంబానికి వర్ధవెల్లి మహర్షి సేవ సమితి, వారు 6,800 రూపాయల ఆర్థిక సహాయం చెయ్యడం జరిగింది అలాగే మహర్షి సేవా సమితి, ఆధ్వర్యంలో ఈరోజు వల్లంపట్ల లక్ష్మి, మరణించడం జరిగింది వారిది చాలా నిరుపేద కుటుంబం వారికి మహర్షి యూత్ సేవాసమితి, తరుపున టీచర్ల రామారావు, తండ్రి గోపాల్ రావు, రెండు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

# మా ప్రభుత్వం హామీ నిలబెట్టుకుంది

- యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాం
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- నూతన పోలీస్ కానిస్టేబుళ్లకు నియామక పత్రాల పంపిణీ

**వేద న్యూస్, మంగళగిరి:**



యువతకు ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుందని, కానిస్టేబుల్ ఉద్యో గాలకు సంబంధించి న్యాయపరమైన కేసులను అధిగమించి, నాలుగేళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ నియామక ప్రక్రియను పూర్తి చేశామని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఎంపికైన 5,757 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం మంగళవారం మంగళగిరిలో జరిగింది. మంగళగిరి ఏపీఎస్పీ పరేడ్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరై అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వంలో ఉద్యోగాలు వస్తాయని, గతంలోనూ 23 వేలకుపైగా పోలీస్ ఉద్యోగాలు, మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అనంతరం సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావించారు. ఆ ఘటన సమయంలో జరిగిన పరిణామాలు, అప్పటి పరిస్థితులపై వ్యాఖ్యానిస్తూ, రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే అంశాలపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో చట్టం, న్యాయమే మార్గదర్శకంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి అనిత కూడా పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన పోలీస్ కానిస్టేబుళ్లకు ఈ నెల 22వ తేదీ నుంచి 9 నెలలపాటు శిక్షణ ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక వారు రాష్ట్రవ్యాప్తంగా విధుల్లో చేరనున్నారని వెల్లడించారు

# శనక్కుంటను కాపాడాలి

- యువ నాయకుడు మహేశ్



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణంలోని సర్వే నంబర్ 1323 లోగల 42 ఎకరాల 3 గుంటలు భూమి శనక్కుంట ఆక్రమణ కు గురి కాకుండా కాపాడుకోవాల్సిన భాధ్యత పట్టణ ప్రజలందరిపై ఉందని యువ నాయకుడు మావురపు మహేష్ అన్నారు. ప్రకృతి సిద్ధంగా, ప్రకృతి సంపదగా ఏళ్లుగా శనక్కుంట ఉందని, ఇప్పుడు కొన్నేళ్ల కింద ఉన్న హద్దులకు అనుగుణంగా భూమి లేదన్నారు. ఈ భూమి పై సర్వే జరిపి హద్దులు నిర్ణయించి ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని, అలాగే ఏదైనా ఆక్రమణ జరిగిందని అనుమానం అన్న చోట విచారణ జరిపి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఈ అంశంపై త్వరలోనే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# డిజిటల్ అరెస్టు.. రూ.2 కోట్ల మోసం!

**వేద న్యూస్, బెంగళూరు ప్రతినిధి:**

బెంగళూరుకు చెందిన ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ డిజిటల్ అరెస్టు భయంతో సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.2 కోట్ల వరకు నష్టపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సైబర్ నేరగాళ్లు చూపిన భయానికి లోనైన ఆమె, వారికి డబ్బు చెల్లించేందుకు రెండు ప్లాట్‌లు, ఒక ఫ్లాట్‌ను కూడా విక్రయించాల్సి వచ్చింది. ఈ ఘటనపై బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బబితా దాస్ అనే మహిళ బెంగళూరు నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఆమెకు పదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ ఏడాది జూన్ నెలలో ఓ వ్యక్తి కొరియర్ అధికారిగా పరిచయం చేసుకుని ఆమెకు ఫోన్ చేశాడు. ఆమె ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు వివరాలతో అనుసంధానమై ఉన్న ఓ పార్సిల్‌లో అనుమానాస్పద వస్తువులు ఉన్నాయని చెప్పాడు. ఈ విషయం వినగానే బబిత భయాందోళనకు గురయ్యింది. అనంతరం ముంబైకి చెందిన అధికారులమని చెప్పుకున్న మరికొందరు ఆమెకు ఫోన్ చేశారు. ఆ పార్సిల్ విషయంలో దర్యాప్తు జరుగుతోందని, ఆమెను డిజిటల్ అరెస్టులో ఉంచామని తెలిపారు. ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని, బయటకు వెల్లడిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతేకాదు, వారు సూచించిన ఒక మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, లేకపోతే ఆమె కుమారుడికి ప్రమాదం జరుగుతుందని బెదిరించారు. తన కుమారుడి భవిష్యత్తు గురించి తీవ్రంగా భయపడిన బబితా, వారు చెప్పిన విధంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంది. ఆ తర్వాత ఆమె బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లకు అందించింది. వారు డిమాండ్ చేసిన డబ్బు చెల్లించేందుకు ఆమె రెండు ప్లాట్‌లు, ఒక ఫ్లాట్‌ను అమ్మి మొత్తం మొత్తాన్ని వారు సూచించిన బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసింది. అంతేకాదు, మరింత డబ్బు కావాలంటూ ఒత్తిడి చేయడంతో బ్యాంకు నుంచి రుణం తీసుకుని మరీ చెల్లించింది. చివరికి సైబర్ నేరగాళ్లు చెల్లించిన డబ్బు తిరిగి పొందాలంటే సమీప పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని చెప్పి ఫోన్ కట్ చేశారు. ఆ తర్వాత వారికి ఫోన్ చేయడానికి ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ రావడంతో మోసం జరిగిందని బబితకు అర్థమైంది. దీంతో ఆమె వైట్‌ఫీల్డ్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఈ డిజిటల్ అరెస్టు మోసం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నేటి యువతకు స్ఫూర్తి శ్రీచరణి

- ఆమె ప్రతిభ ప్రశంసనీయం
- ఏపీ మంత్రి నారా లోకేష్
- రూ.2.5 కోట్ల ప్రోత్సాహకం అందజేత






**వేద న్యూస్, ఉండవల్లి:**

అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర ప్రతిభను చాటిన శ్రీచరణి ప్రదర్శన యువతకు, ముఖ్యంగా బాలికలకు గొప్ప స్ఫూర్తి అని మంత్రి నారా లోకేష్ అన్నారు. మహిళల వన్డే ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసి రాష్ట్రానికి గర్వకారణమైన మహిళా క్రికెటర్ శ్రీచరణికి కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.2.5 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఉండవల్లిలోని నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీచరణిని సత్కరించి, ఆమె సాధించిన విజయాన్ని ప్రభుత్వం తరఫున అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కఠిన సాధన, పట్టుదల, అంకితభావంతో ప్రపంచ కప్‌లో మెరిసిన ఆమె ప్రయాణం ప్రశంసనీయమని పేర్కొన్నారు. క్రీడారంగంలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మహిళల క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతిభను గుర్తించి గౌరవించడం ద్వారా రాష్ట్రంలో క్రీడా సంస్కృతి మరింత బలోపేతం అవుతుందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శ్రీచరణి సాధించిన విజయాలు రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని, రాష్ట్రం నుంచి మరిన్ని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రవాణా, యువజన క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొన్నారు. వారు శ్రీచరణిని అభినందిస్తూ, మహిళా క్రీడాకారులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలకు దారి తీస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# కరీంనగర్ కుర్రాడు ఐపీఎల్‌లోకి..

- రాజస్థాన్ రాయల్స్ దక్కించుకున్న అమన్‌రావు ప్రముఖుల ప్రశంసలు





**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లాకు చెందిన యువ క్రికెటర్ పేరాల అమన్‌రావు ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అడుగుపెట్టాడు. మంగళవారం జరిగిన ఐపీఎల్ 2026 మినీ వేలంలో 21 ఏళ్ల అమన్‌రావును రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. జిల్లా కుర్రాడు ప్రతిష్ఠాత్మక టోర్నీలో చోటు దక్కించుకోవడంతో కరీంనగర్‌తో పాటు హైదరాబాద్ లోనూ క్రీడాభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రస్తుతం హైదరాబాద్ అండర్-23 జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అమన్‌రావు, ఇటీవల జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అద్భుతమైన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ టోర్నీలో 160కు పైగా స్ట్రైక్ రేట్‌తో రెండు అర్ధసెంచరీలు సాధించి సెలెక్టర్లతో పాటు ఐపీఎల్ ఫ్రాంచైజీలను ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా కీలక మ్యాచ్‌ల్లో ధాటిగా ఆడిన తీరుతో తనలో ఉన్న ప్రతిభను చాటుకున్నాడు. అమన్‌రావుకు క్రీడా నేపథ్యం ఉన్న కుటుంబ వారసత్వం ఉంది. ఆయన తండ్రి పేరాల మధుసూదన్‌రావు గతంలో జిల్లా స్థాయి క్రికెటర్‌గా గుర్తింపు పొందగా, తాత పేరాల గోపాల్‌రావు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా సేవలందించారు. అమన్‌రావు స్వగ్రామం సైదాపూర్ మండలం వెన్నంపల్లి కాగా, ప్రస్తుతం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. కరీంనగర్ బిడ్డ ఐపీఎల్‌లోకి ఎంపిక కావడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మాజీ మేయర్ సునీల్‌రావు సహా పలువురు ప్రముఖులు అమన్‌రావుకు అభినందనలు తెలిపారు. యువ క్రికెటర్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

# రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



**- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**వేద న్యూస్, ఖమ్మం:**

మొదటి విడత జరిగిన స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన రఘునాథపాలెం మండలం బీఆర్ఎస్ సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన 11 మంది బీఆర్ఎస్ సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు. కాం గ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన వెనకాడకుండా ఎన్నికల్లో పోరాడినందుకు నాయకులు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు కూడా సిద్ధంగా ఉండాలని అందరు కలిసికట్టుగా పనిచేసి అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని మీకు అండగా ఎళ్లవేళలా ఉంటానని ఎవరి బెదిరింపులకు బయపడొద్దని ధైర్యం చెప్పారు. సన్మానించిన వారిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు కొంటెముక్కల వెంకటేశ్వర్లు, తేజవత్ శంకర్, పొట్లపల్లి రమాదేవి,బానోతు సునీత,మాలోతు జ్యోతి, గుగులోతు మూర్తి, నునావత్ పెంట్యా,మాలోతు సుశీల,జర్పుల సౌందర్య,జర్పుల రవీందర్, భూక్యా సరిత ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరునాయక్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్జెసి కృష్ణ,నగర అధ్యక్షులు పగడాల నాగరాజు,మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవి,మాజీ సర్పంచ్లు హరిప్రసాద్,మెంటం రామారావు,చెరుకూరి ప్రదీప్,నాయకులు ,మాధవరావు,పిన్ని కోటేశ్వరరావు ,పొట్లపల్లి రాజా, తాత వెంకటేశ్వర్లు,కుతుంబాక నరేష్,యాస రామారావు, సైదులు,మోహన్ రావు, వెంకటప్పారావు,రవిప్రకాష్, భాస్కర్, తదితరులు పాల్గొ న్నారు.


# అర్చక సంఘం కార్యవర్గం ఎన్నిక

**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ రామలింగ దూప దీప నైవేద్య అర్చక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆరు మండలాల ఆరు మండలాల ప్రధాన అధ్యక్షుడు సంతోష్ బోధన్కర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ శర్మ, కోశాధికారి మహేందర్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రి కులకర్ణి, సలహాదారులు ప్రేమ్ దాస్, ధనరాజ్, బాలాజీ, రామ్ శంకర్, ప్రచార కార్యదర్శి ధనరాజ్, దోషలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు జిల్లా అధ్యక్షులు రాచప్ప, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ శర్మ, సెక్రెటరీ రాజేందర్, రాష్ట్ర కార్యదర్శి చెన్ బసప్ప, పరమేశ్వర్, శివ స్వామి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్యూట్ పోలీస్

**వేద న్యూస్, చెన్నారావుపేట :**



చెన్నారావుపేట మండలం బోజేరువు గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ పని తీరుకు ప్రజలు సెల్యూట్ పోలీస్ అన్న అని మెచ్చుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఓ వృద్ధ మహిళా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే ప్రయత్నం చేస్తున్న విధానాన్ని గమనించిన హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ ఆమెను తన భుజాలపై పోలింగ్ కేంద్రంలోకి మోసుకు వెళ్లారు. ఈ దృశ్యం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది.

# ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి
- అపరిచిత లింకులు, సమాచారం పంచుకోరాదు
- సైబర్ నేరాల పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి
- తెలంగాణ పోలీసుల హెచ్చరిక

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించకపోతే మోసాలకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. తెలియని వ్యక్తులు పంపే లింకులు, సందేశాలు, కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు.సోషల్ మీడియా వేదికల్లో వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, బ్యాంకు వివరాలు పంచుకోవడం ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. అపరిచిత స్నేహితుల అభ్యర్థనలను అంగీకరించకూడదని, అనుమానాస్పద ప్రొఫైళ్ల నుంచి వచ్చే మెసేజ్‌లను వెంటనే బ్లాక్ చేసి నివేదించాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. పిల్లలు, యువత ఎక్కువగా ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో, వారి ఆన్‌లైన్ కార్యకలాపాలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పోలీసులు సూచించారు. పిల్లలకు సురక్షితమైన ఆన్‌లైన్ అలవాట్లపై అవగాహన కల్పించడం అవసరమని, అనుమానాస్పద విషయాలు ఎదురైతే వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయాలని తెలిపారు. అవసరమైతే పేరెంటల్ కంట్రోల్స్ ఉపయోగించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ అవగాహనతో వ్యవహరించాలని తెలంగాణ పోలీసులు కోరారు. ఏవైనా ఆన్‌లైన్ మోసాలు, బెదిరింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమని పోలీసులు స్పష్టం చేశారు.

# మినరల్ ఫండ్ కోసం పోరాడాలి..

- సర్పంచులు గ్రామాభివృద్ధికి పాటుపడాలి
- తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడావి వెంకటేశ్వర్





**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండల అభివృద్ధి కోసం నూతనంగా ఎన్నికైన సర్పంచులు అందరు కూడా ఐక్యంగా మినరల్ ఫండ్ కోసం పోరాడాలని తుడుం దెబ్బ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడవి వెంకటేశ్వర్ పిలుపు నిచ్చారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడావి వెంకటేశ్వర్ మాట్లాడారు. రాజకీయాలు ఇక వదిలేయాలని, ఎన్నికల పూర్తయిన సందర్భంగా గెలిచిన వారికి శుభాకాంక్షలు తెలిపి, అభివృద్ధి వైపు బాట వేయాలన్నారు. కాసిపేట మండలంలో నిధులు ఉన్న ఇక్కడ వినియోగించుకోకపోవడం వల్ల కాసిపేట మండలం అభివృద్ధి చెందడం లేదన్నారు. ఇప్పటి నూతన సర్పంచులు ఐక్యంగా ఉండి మినరల్ ఫండ్ కాసిపేట మండలంలోని వినియోగించే విధంగా పోరాడాలన్నారు. మంచిర్యాల నుంచి వెంటనే గోదావరి నీళ్లు కాసిపేట మండలంకు తీసుకువచ్చి తాగు, సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- మావోయిస్టుల అరెస్ట్ ను ఖండించిన పార్టీ తెలంగాణ కమిటీ
- కాంగ్రెస్, బీజేపీ విధానాలకు మద్దతివ్వొద్దని పిలుపు
- అధికార ప్రతినిధి జగన్ పేరుతో లేఖ విడుదల



**వేద న్యూస్, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్ ప్రాంతంలో 16 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయడంపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా స్పందించింది. ఈ అరెస్టులను ఖండిస్తూ పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఒక లేఖను విడుదల చేసింది. కకర్ బుడ్డి, బాబ్జీ పేట్ గ్రామాల సమీపంలో నిరాయుధంగా ఉన్న తమ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని లేఖలో ఆరోపించింది. ఈ చర్య తెలంగాణలో కొనసాగుతున్న ప్రజాస్వామ్య వాతావరణానికి తీవ్ర ఎదురుదెబ్బగా అభివర్ణించింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూపొందించిన 'కగార్' యుద్ధానికి మద్దతు ఇవ్వకూడదని మావోయిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది. కేంద్ర ప్రభుత్వం 'మావోయిస్టు ముక్త్', 'ప్రతిపక్ష ముక్త్' లక్ష్యాలతో ఈ యుద్ధాన్ని అమలు చేస్తోందని ఆరోపించింది. ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమైన చర్యల శ్రేణిలో భాగమని లేఖలో పేర్కొంది.'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, ఏక్ చునావ్, ఏక్ పార్టీ' వంటి నినాదాల ద్వారా దేశంలోని ఇతర రాజకీయ పార్టీలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఎన్నికల కమిషన్, కోర్టులు, సీబీఐ, ఎన్ఐఏ వంటి రాజ్యాంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుని పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని విమర్శించింది. దీనికి బీహార్ ఎన్నికలే తాజా ఉదాహరణగా పేర్కొంది. బీజేపీ విధానాలు కార్పొరేట్ శక్తులకు మాత్రమే మేలు చేస్తున్నాయని లేఖలో ఆరోపణలు చేశారు. తెలంగాణలో ప్రశాంత వాతావరణం కొనసాగాలంటే ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఈ అరెస్టులకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత పోరాటాలు అవసరమని లేఖలో పేర్కొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



**- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి**

ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీ జెండాను మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నటువంటి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తెలిపారు. బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఓ సిటీ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజలు క్యాంప్ ఆఫీస్ చేరుకుని తమ సమస్యలను విన్నవించారు. వారి సాధక బాధకాలను సహృదయంతో విన్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సంబంధిత పలువురు అధికారులతో అప్పటికప్పుడే ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న ఏలాంటి పైరవీలు చేయకుండా ఆఫీస్ కి వచ్చి తనను నిర్భయంగా సంప్రదించవచ్చని ప్రజలకు స్పష్టం చేశారు. బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వాలు మారిన ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని భుజాన పార్టీ జెండా మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నటువంటి కార్యకర్తలకు సరైన గుర్తింపు వచ్చేలా వారికి కావలసిన పదవులను దక్కేలా చేస్తానని తెలిపారు. అందరం కలిసి మెలిసి ఉండాలని ఐక్యమత్యం చాటాలన్నారు. కార్యకర్తలకు నాయకులకు పార్టీ పరంగా గౌరవ మర్యాదలు దక్కే విధంగా తాను పాటు పడతానని ఈ సందర్భంగా తెలిపారు. కొండా దంపతులు వరంగల్ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటారని ఎలాంటి ఆపద సమయాల్లోనైనా కొండా దంపతుల ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా కొండా మురళి తెలిపారు.

# భారతీయ వంటకాలంటే ఎంతో ఇష్టం

**హైదరాబాద్ వేద న్యూస్ :**



భారతదేశ వంటకాలతో పాటు వివిధ దేశాల వంటకాలను తాను ఎంతో ఇష్టంగా ఆస్వాదిస్తానని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారెత్ విన్ ఓవెన్ అన్నారు. ఎర్రమంజిల్‌లోని రీజెన్సీ కాలేజ్ ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థులు 'యూరోపియన్ గార్మెట్ గాలా విందు'ను ఏర్పాటు చేశారు.విందులో పాల్గొన్న గ్యారెత్ విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వంటకాలను రుచిచూసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రీజెన్సీ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ కుమార్ రెడ్డి, తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నవీన్ నాగరాజ్, సభ్యులు రిజ్వాన్ అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లప్పుడూ రుణపడి ఉంటా

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



**- లక్ష్మీదేవి గూడెం ఉపసర్పంచ్ గంట స్వాతి నరసయ్య**

నా గెలుపు గ్రామ ప్రజలకు అంకితం అని లక్ష్మీదేవి గూడెం ఉపసర్పంచ్ గంట స్వాతి నరసయ్య అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. లక్ష్మీదేవిగూడెం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ పదవికి సహకరించిన సర్పంచ్ ఎలికట్టి భరత్, వార్డ్ మెంబర్లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాల బలంతో నా గెలుపు సుసాధ్యమైందని అభిప్రాయపడ్డారు. 5వ వార్డ్ గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేస్తానన్నారు. తన గెలుపు కోసం కష్టపడిన పార్టీ నాయకులు కార్యకర్తలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

**వేద న్యూస్, కాజీపేట:**



కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు బస్కేరాజు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మరణించగా, తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రాజు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, శ్రమశక్తి, శ్రామిక రత్న అవార్డు గ్రహీత బస్కే దశరథం మాట్లాడుతూ.. కార్మికుడు రాజు మృతి చెందడం బాధాకరమని, రాజుకు లేబర్ కార్డు ఉన్నందున అతనికి ప్రభుత్వం నుండి రావలసిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతీ కార్మికుడు లేబర్ కార్డు పొంది ఉండాలని, లేబర్ కార్డు ద్వారా కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని, కార్డు పొంది ఉన్న ప్రతీ కార్మికుడు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకుని ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మారబోయిన రాములు, రిపిక పోశయ్య, బస్కే భద్రయ్య, బస్కే రామకృష్ణ, కొడవటి సమ్మయ్య, బస్కే ప్రదీప్, లక్ష్మీనారాయణ తదితర కార్మికుల పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం డిసెంబర్ 18, 2025

# గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- నిధులు మంజూరు బాధ్యత నాది
- నూతన సర్పంచ్, వార్డు మెంబర్లతో ఎమ్మెల్యే కవ్వంపల్లి

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామ సర్పంచ్ గా వొల్లాల రజిత-వెంకటేశం గెలుపొందిన సందర్భంగా సర్పంచ్, వార్డు మెంబర్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను బుధవారం ఎల్ఎండి కాలనీలోని క్యాంపు కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నూతనంగా గెలుపొందిన వారిని శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా, గ్రామాల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. అలాగే పంచాయితీ పాలకవర్గాలు ప్రజలతో మమేకం కావాలని, అభివృద్ధి పనులకు తనవంతు తోడ్పాటునందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అనంతారం మాజీ సర్పంచ్, మండల ఫోరం అధ్యక్షులు చల్ల నారాయణ, మాజీ ఎంపీపీ ఉట్కూరి వెంకటరమణారెడ్డి, ఐరెడ్డి మహేంద్రర్ రెడ్డి, సర్పంచ్ కోమిటీ రెడ్డి భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ కదం జయంత్,గ్రామ వార్డు మెంబర్లు ఆక్కేం ఉపేందర్,గోనపల్లి లావణ్య-వెంకటేశం, చొప్పరి సాయిలు, సిరిపురం రమేష్, వొల్లాల లత-కిష్టయ్య, గ్రామ నాయకులు గరిగే లక్ష్మీనారాయణ, వొల్లాల నరసయ్య, రాములు, మధు, మచ్చ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పని ప్రదేశాలలో మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



- పోష్ చట్టం -2013పై అవగాహన అవసరం - డాక్టర్ అనితా రెడ్డి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

పోష్ చట్టం పై గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అవగాహన అవసరం అని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోష్ కమిటీ కన్వీనర్, చైర్మన్ ప్రముఖ సోషల్ ఆక్టివిస్ట్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. పోష్ చట్టం -2013 ప్రివెన్షన్ ఆఫ్ సెక్చువల్ హెరాస్మెంట్ పై అవగాహన నిర్వహించడం ద్వారా మహిళలు పని ప్రదేశాలలో ఏ ఇబ్బందులు ఎదురైనా ఎదుర్కొనే మానసిక స్థయిర్యం కలుగుతుందని అన్నారు. చట్టాల పై అవగాహన ఉన్నప్పుడే వాటిని వినియోగించుకోగలుగుతారని తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలు లైంగిక వేధింపులు, నిరాదరణ, నిషేధం మరియు పరిహార చట్టాన్ని పోష్ చట్టం అంటారని ఈ చట్టం పై అవగాహన కలిగి ఉంటే ఉద్యోగాలు చేసే ప్రదేశాలలోమహిళలు తమను తాము సమస్యలు వస్తే ఎలా రక్షించు కోవాలి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మహిళలు అర్థం చేసుకుని ధైర్యంగా ఎదురుకోగలుగుతారని అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రవేటు కార్యాలయాలలో, హస్పిటల్స్, స్కూల్స్, కాలేజిలు, వాణిజ్య, వ్యాపార సంస్థలలో సయితము ఈ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు.

# కాశ్మీర్ లోయకు యుద్ధ ట్యాంకులు !

- ఆర్టిలరీ గన్స్ కూడా తరలింపు
- సైనిక ప్రత్యేక రైలు ద్వారా కీలక లాజిస్టిక్స్ మైలురాయి
- జమ్మూ నుంచి అనంతనాగ్ వరకు విజయవంతమైన తరలింపు
- ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్ కీలక పాత్ర

**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**



దేశ ఉత్తర సరిహద్దుల వెంట సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా భారత సైన్యం కీలక ముందడుగు వేసింది. కాశ్మీర్ లోయకు ట్యాంకులు, ఆర్టిలరీ గన్స్‌ను సైనిక ప్రత్యేక రైలు ద్వారా తరలిస్తూ భారత సైన్యం ఒక ప్రధాన లాజిస్టిక్స్ మైలురాయిని సాధించింది. ఈ చర్యతో సైన్యం వేగవంతమైన కదలికలు, సరఫరా సామర్థ్యాల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు తెలిపారు. వాలిడేషన్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా జమ్మూ ప్రాంతం నుంచి కాశ్మీర్ లోయలోని అనంతనాగ్ వరకు ట్యాంకులు, ఆర్టిలరీ గన్స్, డోజర్లు విజయవంతంగా తరలించారు. కఠిన భౌగోళిక పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ తరలింపు సజావుగా పూర్తవడం ద్వారా భారత సైన్యం యొక్క లాజిస్టిక్స్ ప్రణాళికా సామర్థ్యం, కార్యాచరణ సిద్ధత స్పష్టంగా వెల్లడైందని పేర్కొన్నారు. ఈ విజయానికి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖతో సన్నిహిత సమన్వయం కీలకంగా నిలిచింది. ముఖ్యంగా ఉధంపూర్ - శ్రీనగర్ - బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్ట్ అమల్లోకి రావడంతో, ఉత్తర సరిహద్దుల వెంట వేగంగా సైనిక సరఫరాలు చేరవేయడం సాధ్యమైందని అధికారులు వివరించారు. ఈ రైల్వే లింక్ వల్ల దూర ప్రాంతాల్లోనూ భారీ సైనిక పరికరాలను త్వరగా తరలించే సామర్థ్యం ఏర్పడింది. ఉత్తర సరిహద్దుల వద్ద ఆపరేషనల్ రెడినెస్‌ను మరింత బలోపేతం చేయడంలో ఈ పరిణామం కీలకంగా మారిందని రక్షణ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఆధునిక మౌలిక వసతులు, రవాణా నెట్వర్క్‌లతో భారత సైన్యం సరిహద్దు భద్రతను మరింత సమర్థవంతంగా నిర్వహించే స్థాయికి చేరుతోందని, ఈ లాజిస్టిక్స్ విజయం భవిష్యత్ రక్షణ సన్నద్ధతకు బలమైన పునాదిగా నిలుస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

# గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు

- సర్పంచ్ కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటా
- ఆమనగల్లు ఉపసర్పంచ్ మెరుగు షాలీమ్ రాజు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



తన గెలుపునకు కృషిచేసిన ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని.. వారి అడుగుజాడల్లో పనిచేస్తానని ఆమనగల్లు ఉపసర్పంచ్ మెరుగు షాలిము రాజు అన్నారు. బుధవారం స్థానికంగా వేద న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ.. ఆమనగల్లు గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ పదవికి సహకరించిన సర్పంచ్ పిల్లల సందీప్, వార్డ్ మెంబర్లకు, పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాల బలంతో తన గెలుపు సుసాధ్యమైందని అభిప్రాయపడ్డారు. 9వ వార్డ్ గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మెరుగు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. మా తమ్ముడు శాలెం రాజు ఉప సర్పంచ్ పదవికి సహకరించిన వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. ఆయన వెంట మెరుగు వెంకన్న, యాపేత్, కుమార్, నరేష్ తదితరులు ఉన్నారు.

# కాట్నపల్లి ప్రజలకు ధన్యవాదాలు

- సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్
- తొలిసారి బరిలో నిలిచి సర్పంచ్‌గా ఘన విజయం



**వేద న్యూస్, సుల్తానాబాద్:**

కాట్నపల్లి గ్రామ ప్రజలకు ఓగుల పూజ రాజేందర్ ధన్యవాదాలు తెలిపారు. కత్తెర గుర్తుకు ఓటేసి ప్రజలు తమను ఆదరించి.. నిండు మనసుతో ఆశీర్వదించి.. తమను సర్పంచ్‌గా గెలిపించారని పూజ రాజేందర్ వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూజ రాజేందర్ మాట్లాడుతూ.. తాము ప్రజలకు సర్పంచ్‌గా ఐదేండ్ల కాలంలో చక్కటి సేవలు అందిస్తామని చెప్పారు. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చొరవ తీసుకుంటామని, గ్రామాన్ని మండలంలో అగ్రగామిగా నిలిపి.. అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచేలా తమ వంతుగా చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం సర్పంచ్‌గా గెలిచిన అనంతరం.. ప్రజలకు ధన్యవాదాలు



వేద న్యూస్

2025-12-06
https://epaper.vedhanews.in/

## 'ఓగుల' వైపు కాట్నపల్లి ప్రజల మొగ్గు

- ప్రజాసేవే లక్ష్యంగా సేవా మార్గంలో పూజ రాజేందర్
- కాట్నపల్లి గ్రామ అభివృద్ధియే ధ్యేయం: సర్పంచ్ అభ్యర్థి పూజ

**వేద న్యూస్, సుల్తానాబాద్:**

కష్టం విలువ తెలిసిన వ్యక్తి ఆయన.. చిన్న నాటి నుంచి పేదరికం అనుభవించిన ఓగుల రాజేందర్.. సమాజంలో సేవాభావం పెంపొందాలని కోరుతూ.. ఆ మార్గంలో ముందుకెళ్లే సద్భావన కలిగిన యువకుడు. ఈ క్రమంలోనే సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామ సర్పంచ్ బరిలో అభ్యర్థిగా ఆయన సతీమణి పూజను నిలిపారు. వారిరువురు ప్రజాసేవలో తమ వంతు పాత్ర పోషించేందుకు నడుం బిగించారు. తనను ఆశీర్వదించి.. అవకాశమిస్తే.. అభివృద్ధి పథంలో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తామని సర్పంచ్ అభ్యర్థి ఓగుల పూజ రాజేందర్ వెల్లడించారు.

**యువత కు అవకాశమివ్వాలి**

నేటి సమాజంలో యువతకు అవకాశమిస్తేనే.. వారి ఆలోచనలు, ఆచరణ ఎలా ఉంటుందో తెలిసే అవకాశముంటుందని, ఈ నేపథ్యంలోనే తనకు గ్రామ సర్పంచ్‌గా అవకాశమివ్వాలని సర్పంచ్ అభ్యర్థి పూజ కోరుతున్నారు. విద్యావంతులు, సమాజంలో సేవాభావం పెంపొందించేందుకు, నిజమైన ప్రజా సేవలో ముందుకెళ్లాలనే భావన కలిగిన తమకు అవకాశమిస్తే.. తాము ఎలా పని చేస్తామో.. చేసి చూపిస్తామని ఓగుల పూజ రాజేందర్ తెలిపారు. కాట్నపల్లి గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా తమ అడుగులు ఉంటాయని, అవినీతికి తావు లేకుండా పరిపాలన అందిస్తామని హామీనిస్తున్నారు. తాము పేదరికం నుంచి వచ్చిన వారమని, పేదరికం విలువ తెలిసిన మనుషులం కాబట్టి.. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు .. చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వం దృష్టికి, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఏ విషయాన్ని అయినా తీసుకెళ్లే చొరవ, శక్తి సామర్థ్యాలు తమకు ఉన్నాయని చెప్పారు. తమను కాట్నపల్లి గ్రామ ప్రజలు నిండుగా, మెండుగా ఆశీర్వదించి.. ఓటు రూపంలో తమ దీవెనలు అందించి.. సర్పంచ్‌గా భారీ మెజారిటీతో గెలపించాలని ఓగుల పూజ రాజేందర్ కాట్నపల్లి గ్రామ ప్రజలను వినమ్రంగా వేడుకుంటున్నారు.

తెలిపిన పూజ రాజేందర్.. ఊరేగింపులో ప్రజలతో కలిసి పాల్గొన్నారు.

**ముందే చెప్పిన 'వేద న్యూస్'**

ప్రజాసేవే లక్ష్యంగా సేవా మార్గంలో పూజ రాజేందర్ ...అడుగులు వేసి.. సేవే లక్ష్యంగా కాట్నపల్లి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సంగతిని 'వేద న్యూస్' పేర్కొంది. కాట్నపల్లి గ్రామ ప్రజలు ఓగుల పూజ రాజేందర్ వైపే మొగ్గు చూపుతున్నట్టు ఈ నెల 6న 'వేద న్యూస్' తన కథనంలో ప్రస్తావించింది. 'ఓగుల వైపు కాట్నపల్లి ప్రజల మొగ్గు' శీర్షికన వేద న్యూస్ తెలుగు దినపత్రిక ప్రచురించిన కథనం అక్షరాలా నిజమైంది. బుధవారం విడుదలైన సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో కాట్నపల్లి గ్రామ సర్పంచ్‌గా ఓగుల పూజ రాజేందర్ విజయకేతనం ఎగురవేశారు.

# సివిల్ కాంట్రాక్టర్ నుంచి రూ.11వేల లంచం

**హైదరాబాద్ వేద న్యూస్ :**



అవినీతి నిరోధక శాఖ దాడుల్లో బిల్డింగ్ డివిజన్ డీఈ శ్రీనివాస్ రెడ్ హ్యాండ్‌గా దొరికి పోయాడు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్కార్యాలంలో బుధవారం సివిల్ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ డీఈ శ్రీనివాస్ పట్టుబడ్డాడు. శ్రీనివాస్ సదరు కాంట్రాక్టర్ రూ. 11,000 లంచం డిమాండ్ చేశాడని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. 'ఓయూ మానేరు హాస్టల్‌లో సివిల్ వర్క్స్ ట్రాక్టర్ రూ.14 లక్షల బిల్ పాస్ చేయడం కోసం బిల్డింగ్ డివిజన్ డీఈ శ్రీనివాస్ రూ. 11 వేలు లంచం అడిగాడు. వారం రోజుల కింద ఫోన్ పే ద్వారా రూ. 5,000 పంపాడు కాంట్రాక్టర్. మిగిలిన రూ. 6 వేల ఇవ్వాలని శ్రీనివాస్ సదరు కాంట్రాక్టర్‌ను వేధించాడు. దాంతో.. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం అని డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.

# కనగర్తి సర్పంచ్‌గా రామంచ సంపత్

- ఘనవిజయం సాధించిన కమలం పార్టీ అభ్యర్థి
- బ్యాట్ వైపు మొగ్గు చూపిన గ్రామస్తులు
- గ్రామ ప్రథమ పౌరుడిగా ప్రజలకు చక్కటి సేవలందిస్తా - సంపత్

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



మండల పరిధిలోని కనగర్తి గ్రామ సర్పంచ్‌గా రామంచ సంపత్ ఎన్నికయ్యారు. హోరాహోరిగా సాగిన పోరులో సమీప ప్రత్యర్థి రాజుపై 325 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. దీంతో గ్రామంలోని కమలం పార్టీ శ్రేణులు బుధవారం సంబురాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామ నూతన సర్పంచ్ సంపత్ రామంచ మాట్లాడుతూ.. గ్రామ ప్రథమ పౌరుడిగా తాను చక్కటి సేవలు అందిస్తానని వెల్లడించారు. ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో గ్రామ శ్రేయస్సుకు పాటు పడతానని చెప్పారు. కనగర్తి గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు సహకరించి.. తన గెలుపునకు కృషి చేసిన బీజేపీ నేతలు, కార్యకర్తలకు పేరుపేరున కృతజ్ఞతలు చెప్పారు. ప్రజాశ్రేయస్సుయే ధ్యేయంగా తాను చక్కటి సేవలందిస్తానని వెల్లడించారు.

# ప్రజాశ్రేయస్సు కోసం పని చేస్తా

- గడ్డివానిపల్లి గ్రామ సర్పంచ్‌గా గడ్డి శ్రీనివాస్
- సమీప ప్రత్యర్థిపై 56 ఓట్ల మెజారిటీతో ఘన విజయం

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



ఇల్లందకుంట మండల పరిధిలోని గడ్డివానిపల్లి గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీబలపరిచిన అభ్యర్థి, యువనేత గడ్డి శ్రీనివాస్ గెలుపొందారు. ఆయన తన సమీప ప్రత్యర్థి అయిలయ్యపై 56 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా, గ్రామ అభివృద్ధియే లక్ష్యంగా సర్పంచ్‌గా సేవలందిస్తానని ఈ సందర్భంగా గడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. ప్రజలకు ఐదేండ్ల కాలంలో చేయబోయే పనుల గురించి బాండ్ పేపర్ పై ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తానని పేర్కొన్నారు. గడ్డి శ్రీనివాస్ గెలుపుతో కాంగ్రెస్ మద్దతుదారులు, శ్రీనివాస్ వర్గీయుల్లో ఉత్సాహం నెలకొంది. వారు బుధవారం సంబురాలు చేసుకున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073